https://teluguislam.net



# ప్రవక్త (స) వంశావళి

**వంశం :** దైవప్రవక్త (స) వంశావళిని మూడు భాగాలుగా విభజించ వచ్చు. మొదటి భాగం, చరిత్రకారులు, వంశజ్ఞులు అందరూ ఏకీభవించిన భాగం. ఈ వంశావళి 'అద్నాన్' వరకు వెళ్ళి ఆగిపోతుంది. రెండవ భాగం గురించి చరిత్రకారుల మధ్య అభిప్రాయభేదం ఉంది. కొందరు దీన్ని ఒప్పు కుంటారు, కొందరు నిరాకరిస్తారు. ఈ వంశావళి అద్నాన్ పైన ఇబ్రాహీం (అ.స.) వరకు వెళ్ళి ఆగుతుంది. ఇక మూడవ భాగం. ఇందులో కొన్ని తప్పులు దొరిలాయి. ఈ వంశావళి ఇబ్రాహీం (అ.స.) నుండి పైకి హజ్రత్ ఆదం (అ.స.) వరకు వెళ్ళి ఆగుతుంది. వెనుకటి పుటల్లో ఈ విషయాన్ని చూచాయగా చెప్పుకోవడం జరిగింది. క్రింది పంక్తుల్లో ఈ మూడు భాగాలను గురించి పేర్కొనటం జరుగుతుంది.

## మొదటి భాగం

ముహమ్మద్ (స) తండ్రి అబ్దుల్లాహ్, ఆయన తండ్రి అబ్దుల్ ముత్తలిబ్ (షైబా), ఆయన తండ్రి హాషిమ్ (అమ్రూ). హాషిమ్ తండ్రి అబ్దె మునాఫ్ (ముగీరా). ఆయన తండ్రి ఖుస్సై (జైద్). ఖుస్సై తండ్రి కిలాబ్. కిలాబ్ తండ్రి ముజ్జా. ముజ్జా తండ్రి కఅబ్. ఆయన తండ్రి లువీ. లువీ తండ్రి గాలిబ్. ఆయన తండ్రి ఫహర్ (ఈయన బిరుదే ఖురైష్. ఆయన ఈ బిరుదు వల్లనే ఆ తెగకు ఖురైష్ తెగగా పేరు పడింది). ఫహర్ తండ్రి మాలిక్. ఆయన తండ్రి నజ్ర్ (ఖైస్). నజ్ర్ తండ్రి కనానా. ఆయన తండ్రి ఖుజైమా. ఖుజైమా తండ్రి ముద్రికా (ఆమిర్). ముద్రికా ఇలియాస్ కుమారుడు. ఇలియాస్ తండ్రి ముజ్ర్. ఈయన నజార్ కుమారుడు. నజార్ తండ్రి మఅద్. మఅద్ తండ్రి అద్నాన్.[1]

https://teluguislam.net



## రెండవ భాగం

అద్నాన్‌కు పైన. అంటే అద్నాన్ తండ్రి 'ఔ'. ఆయన తండ్రి 'హమీసా'. హమీసా తండ్రి 'సలామాన్', సలామాన్ తండ్రి 'ఔస్', ఆయన తండ్రి 'యూజ్', యూజ్ తండ్రి 'ఖమ్‌వల్'. ఖమ్‌వల్ తండ్రి 'ఉబై'. ఆయనకు తండ్రి 'అవామ్', అవామ్ తండ్రి 'నాషిద్', నాషిద్ 'హిజా' కుమారుడు. హిజాకు తండ్రి 'బల్దాస్'. బల్దాస్ తండ్రి 'యద్‌లాఫ్', యద్‌లాఫ్ 'తాబిక్' కుమారుడు. తాబిక్ 'జాహిమ్'కుమారుడు. జాహిమ్ 'నాహిష్' కుమారుడు. నాహిష్ తండ్రి 'మాకీ'. ఆయన తండ్రి 'అయిజ్', అయిజ్ 'అబ్కార్' కుమారుడు. అబ్కార్ 'ఉబైద్' కుమారుడు. ఆయన తండ్రి 'అద్దఆ'. ఈయన 'హమ్దాన్' కుమారుడు. హమ్దాన్ 'సంబర్'కు, సంబర్ 'యస్రబీ'కి, యస్రబీ 'యహ్జాన్'ల కుమారులు. యహ్జాన్ తండ్రి 'అర్అవీ', అర్అవీ తండ్రి అయిజ్‌లు. అయిజ్ జీషాన్‌కు, జీషాన్ అసీర్‌కు, అసీర్ ఉఫ్నాద్‌కు తండ్రులు. ఉఫ్నాద్ 'అయిహామ్' కుమారుడు. అయిహామ్ తండ్రి ముఖ్సర్, ఆయన తండ్రి నాహిస్, ఆయనకు తండ్రి జిరాహ్. సమీ జిరాహ్ తండ్రి. జిరాహ్ తండ్రి మజీ. ఈయన 'ఔజా' కుమారుడు. ఔజా 'అరామ్' కుమారుడు. అరామ్ తండ్రి కైదార్. కైదార్ తండ్రి ఇస్మాయీల్ (అ.స.), ఇస్మాయీల్ (అ.స.) తండ్రి ఇబ్రాహీం (అ.స.).[2]

## మూడవ భాగం

హజ్రత్ ఇబ్రాహీం (అ.స.)కు పైన. ఇబ్రాహీం (అ.స.) తండ్రి తారెహ్ (ఆజర్), తారెహ్ తండ్రి నాహూర్, నాహూర్ తండ్రి సారూ (లేదా సారూగ్), సారూ తండ్రి రాఊ, రాఊకు తండ్రి ఫాలిక్, ఫాలిక్ తండ్రి ఆబిర్. ఈయన షాలిక్ కుమారుడు. షాలిక్‌కు తండ్రి అర్ఫక్షద్. అర్ఫక్షద్ తండ్రి సామ్. సామ్ తండ్రి నూహ్ (అ.స.), నూహ్ (అ.స.) తండ్రి లామిక్. ఈయనకు తండ్రి ముతవష్లక్. ముతవష్లక్ తండ్రి అఖ్నూక్ (ఇది ఇద్రీస్ (అ.స.) గారి పేరుగా చెప్పుకోవడం జరుగుతోంది), అఖ్నూక్ తండ్రి యర్ద్, యర్ద్ తండ్రి మహ్లాయీల్, మహ్లాయీల్

1. *ఇబ్నె హష్షామ్-1/201, తల్‌ఖీహ్‌ఫహూమ్ అహ్లుల్ అస్-పుట 5,6; రహ్మతుల్ లిల్ ఆలమీన్-2/11 నుండి 14, 52.*
2. *అల్లామా మన్సూరి లోతైన పరిశోధన చేసి ఈ వంశవృక్ష భాగాన్ని, కలబీ మరియు ఇబ్నె అసద్ ఉల్లేఖనాల నుండి సంకలనం చేశారు. చూడండి. రహ్మతుల్ లిల్ ఆలమీన్-2/14-17. చరిత్ర ఆధారాల్లో ఈ భాగం గురించి అభిప్రాయ భేదాలున్నాయి.*

https://teluguislam.net



తండ్రి ఖీనాన్, ఈయనకు తండ్రి అనూషా, అనూషా తండ్రి షైస్ (అ.స.), షైస్ (అ.స.) తండ్రి ఆదం (అ.స.).[3]

**ప్రవక్త (స) వంశావళి :** దైవప్రవక్త (స) గారి వంశావళి ఆయన ముత్తాత హాషిమ్ బిన్ అబ్దె మునాఫ్‌తోగల సంబంధం రీత్యా హాషిమీ వంశంగా పేరు గాంచింది. కాబట్టి హాషిమ్, ఆ తరువాతి కొందరు వ్యక్తుల వివరాలను క్లుప్తంగా తెలియజేయడం అవసరమనిపిస్తోంది.

**1. హాషిమ్ :** ఇదివరకు మేము చెప్పినట్లు, బనూ అబ్దె మునాఫ్ మరియు బనూ అబ్దుద్దార్ నడుమ హోదాల పంపకం విషయమై రాజీ కుదిరినప్పుడు అబ్దె మునాఫ్ సంతానంలో హాషిమ్ ఒక్కడికే 'సికాయా' మరియు 'రిఫాదా' అంటే హజ్ యాత్రికులకు నీళ్లు త్రాపే, వారికి ఆతిథ్యం ఇచ్చే హోదాలు లభిం చాయి. హాషిమ్ మంచి గౌరవం, సంపద కలిగిన వ్యక్తి. మొట్టమొదట హాజీలకు మాంసపు చారు (Borth)లో రొట్టె ముక్కలను వేసి తినిపించే ఆనవాయితీ వేసిన మొదటి వ్యక్తి ఆయన. ఈయన అసలు పేరు అమ్రూ. అయితే రొట్టెల్ని ముక్కలుగా చేసి చారులో కలపడం వలన ఆయనకు హాషిమ్ అనే పేరు వచ్చింది. హాషిమ్ అంటే ముక్కలుగా చేసేవాడని అర్థం. అదే కాదు, ఖురైష్ కోసం ఎండా కాలం, చలికాలాల్లో ఏడాదికి రెండు వ్యాపార బిడారాలను పంపే పునాది వేసిన మొట్టమొదటి వ్యక్తి కూడా ఈ హాషిమే. ఈయన గురించి ఓ కవి ఇలా పొగిడాడు:

"కరువుపీడిత సమయాల్లో తన బలహీన జాతికి మక్కాలో రొట్టెలను త్రుంచి మాంసపు చారులో వేసి తడిపి తినిపించినవాడూ, ఎండా కాలం, చలి కాలాల్లో రెండు ప్రయాణాలను ప్రారంభించినవాడూ ఈ అమ్రూయే."

ఈయనకు సంబంధించిన ఓ ముఖ్య సంఘటన ఇలా ఉంది. ఆయన వ్యాపారం చేయడానికి సిరియా దేశానికి వెళ్ళాడు. ప్రయాణం చేస్తూ మదీనా వెళ్ళినప్పుడు అక్కడ బనీ నజ్జార్ తెగకు చెందిన ఓ యువతి సల్మా బిన్తె అమ్రూను వివాహమాడి కొన్ని రోజులు అక్కడే మకాం వేశాడు. భార్యను గర్భ వతిగా పుట్టింటనే వదలి సిరియాకు వెళ్ళిపోయాడు. అక్కడకు వెళ్ళి పాలస్తీనా

---

3. *ఇబ్నె హష్షామ్-1 /2-4; తల్గీహుల్ ఫహూం-పుట.6; ఖులా సతుస్సియర్-పుట. 6; రహ్మతుల్ లిల్ ఆలమీన్-2/18.* కొన్ని పేర్ల విషయంలో వాటి ఆధారాల్లో అభిప్రాయ భేదం ఉంది. కొన్ని పేర్లు కొన్ని ఆధారాల్లో కానరావు.

https://teluguislam.net



నగరమైన గజ్జాలో మరణించాడు. ఇటు సల్మా ఓ మగ శిశువుకు జన్మనిచ్చింది. ఇది క్రీ.శ.497 నాటి మాట. పిల్లవాని తల వెంట్రుకల్లో తెలుపు వెంట్రుకలు ఉన్నందున సల్మా ఆ పిల్లవానికి 'షైబా' అని పేరు పెట్టింది.[4] యస్రిబ్ (మదీనా) లోనే ఆ పిల్లవాణ్ణి సాకింది. భవిష్యత్తులో ఈ కుర్రవాడే అబ్దుల్ ముత్తలిబ్‌గా పేరు పొందాడు. చాలా కాలం వరకు హాషిమ్ కుటుంబానికి ఈ పిల్లవాని గురించి ఏమీ తెలియలేదు. హాషిమ్‌కు మొత్తం నలుగురు కుమారులు, అయిదుగురు కుమార్తెలుండేవారు. వారి పేర్లు ఇలా ఉన్నాయి. అసద్, అబూ సైఫీ, నజ్లా మరియు అబ్దుల్ ముత్తలిబ్ - కుమార్తెలు, షిఫా, ఖాలిదా, జయీఫా, రుఖియా మరియు జంతా.[5]

**2. అబ్దుల్ ముత్తలిబ్ :** వెనుకటి పుటల్లో మనం, హాషిమ్ తరువాత ఆయన సోదరుడు 'ముత్తలిబ్'కు సికాయా, రిఫాదా హోదాలు దక్కాయి అని చదువుకున్నాం. 'ముత్తలిబ్' కూడా ఆయన జాతిలోని ఓ గౌరవోన్నతులుగల వ్యక్తి. ఆయన మాటకు ఎదురు ఉండేది కాదు. ఆయన దాతృత్వం మూలంగా ఖురైషులు ఆయనను 'ఫయ్యాజ్' (దాత) అనే బిరుదుతో పిలిచేవారు. 'షైబా'కు (అంటే అబ్దుల్ ముతల్లిబ్‌కు) పదేళ్ళ ప్రాయం వచ్చినప్పుడు ఆ బాలుణ్ణి పిలుచుకురావడానికి బాబాయి ముత్తలిబ్ మదీనా వెళ్ళాడు. యస్రిబ్ సమీపాన వెళ్ళినప్పుడు షైబాను చూశారు. వెంటనే ఆయన కళ్ళు చెమ్మగిల్లాయి. హృదయానికి హత్తుకుని తన వాహనంపై ఎక్కించుకొని మదీనాకు బయలు దేరాడు. కాని షైబా, తల్లి అనుమతి లేకుండా ఆయన వెంట వెళ్ళడాన్ని నిరాక రించాడు. అందుకని ముత్తలిబ్ షైబా తల్లి అనుమతి కోరగా ఆమె అనుమతి ఇవ్వలేదు. చివరికి ముత్తలిబ్ ఆమెతో, ఈ పిల్లవాడు తన తండ్రి రాజ్యానికి, హరమ్ (కాబా) వైపునకు వెళుతున్నాడు కాబట్టి తప్పక పంపించితీరాలని పట్టుబట్టాడు. దీనికి షైబా తల్లి పిల్లవాణ్ణి తీసుకు వెళ్ళడానికి అనుమతి ఇచ్చింది. ముత్తలిబ్ తన ఒంటెపై ఎక్కించుకొని మక్కా వచ్చారు. మక్కా ప్రజలు అది చూసి, ఈ పిల్లవాడు అబ్దుల్ ముత్తలిబ్ (ముత్తలిబ్ బానిస) అని చెప్పుకోవడం ముత్తలిబ్‌కు వినిపించింది. దానికి సమాధానంగా ముత్తలిబ్, కాదు కాదు ఇతడు నా సోదరుడు హాషిమ్ కుమారుడని నచ్చజెప్పడం జరిగింది.

---

*4. ఇబ్నె హష్షామ్-1/137; రహ్మతుల్ లిల్ ఆలమీన్-1/26, 2/24.*

*5. ఇబ్నె హష్షామ్-1/137; రహ్మతుల్ లిల్ ఆలమీన్-1/107.*

https://teluguislam.net



షైబా ముత్తలిబ్ దగ్గరే ఉండి పెరిగి పెద్దయ్యాడు. షైబా యవ్వన దశలో కాలిడినప్పుడు ముత్తలిబ్, యమన్ దేశంలో రూమాన్ అనే చోట మరణించాడు. ఆయన హోదాలన్నీ అబ్దుల్ ముత్తలిబ్‌కు దక్కాయి. అబ్దుల్ ముత్తలిబ్ తన జాతిలో ఇదివరకు వారి తాత తండ్రులు గడించలేని గౌరవోన్నతులను పొందాడు. జాతి యావత్తూ ఆయన్ను ప్రాణంకన్నా మిన్నగా, అమిత గౌరవంగా చూసుకుంది.[6]

ముత్తలిబ్ మరణించగానే నౌఫిల్, అబ్దుల్ ముత్తలిబ్ ఇంటిని, ప్రాంగణాన్ని బలవంతంగా ఆక్రమించుకున్నాడు. అబ్దుల్ ముత్తలిబ్ తన పినతండ్రికి వ్యతిరేకంగా ఖురైష్‌కు చెందిన కొందరు పెద్దల సహాయం అర్థించారు. అయితే వారు, మేము నీకూ, నీ పినతండ్రికి నడుమ తలదూర్చమని నిక్కచ్చిగా చెప్పేశారు. చివరికి అబ్దుల్ ముత్తలిబ్ బనీ నజ్జార్ తెగకు చెందిన తన మేనమామకు కొన్ని పద్యపంక్తుల్ని రాసి పంపించాడు. ఆ పద్యపంక్తుల్లో, మేనమామను వచ్చి తనను ఆదుకొమ్మని వేడుకున్నాడు. దీనికి ప్రతిస్పందించిన మేనమామ అబూ సఅద్ బిన్ అద్దీ ఎనభై మంది అశ్వారూఢులతో మక్కాకు బయలుదేరి మక్కా దాపున ఉన్న 'అబ్‌తహ్' అనే ప్రదేశంలో విడిది చేశాడు. అబ్దుల్ ముత్తలిబ్ ఆయన్ను అక్కడే కలుసుకొని, మామగారూ! ఇంటికి రండి అని ఆహ్వానించాడు. దానికి అబూ సఅద్, కాదు, దైవసాక్షి! నౌఫిల్‌ను కలుసుకోనంతమట్టుకు నేను ఎటూ రాను అని ప్రతిజ్ఞ చేశాడు. ఆ తరువాత అబూ సఅద్ అక్కడి నుండి బయలుదేరి నౌఫిల్ ఉన్న చోటికి చేరుకున్నాడు. అప్పుడు నౌఫిల్ 'హతీమ్' (కాబా గృహాన్ని ఆనుకొని ఉన్న ప్రదేశం)లో ఖురైష్ పెద్దలతో కూర్చుని మంతనాలాడుతున్నాడు. అబూ సఅద్ కత్తిదూసి, ఈ పవిత్ర దైవ గృహం సాక్షి! నీవు నా మేనల్లుడి భూమిని తిరిగి ఇచ్చేయకపోతే ఈ ఖడ్గంతో నిన్ను ముక్కలుగా చేసేస్తానని బెదిరించాడు. అప్పుడు నౌఫిల్ సరే నేను దాన్ని ఆయనకు ఇచ్చేశానని చెప్పాడు. ఈ సంఘటనకు అక్కడున్న ఖురైష్ పెద్దల్ని సాక్షులుగా చేశాడు. అబ్దుల్ ముత్తలిబ్ ఇంటికి వెళ్ళి అక్కడ మూడు రోజుల వరకు ఉండి 'ఉమ్రా' చేసిన తరువాత మదీనాకు వెళ్ళిపోయాడు.

ఈ సంఘటన జరిగిన తరువాత, నౌఫిల్, బనీ హాషిమ్‌కు వ్యతిరేకంగా బనీ అబ్దుషమ్స్‌తో పరస్పరం సహాయసహకారాలు అందించే ఒప్పందం చేసుకున్నాడు. ఇటు బనూ నజ్జార్ అబ్దుల్ ముత్తలిబ్‌కు చేసిన సహాయాన్ని గమనిం

6. ఇబ్నె హష్షామ్-1/137, 138.

https://teluguislam.net



చిన 'బనూ ఖుజాఅ', బనూ నజ్జార్‌తో "అబ్దుల్ ముత్తలిబ్! నీకు సంతానం ఎలాగో అలాగే ఆయన మాకూ సంతానమే. కాబట్టి మేము దానికి సహాయసహకారాలందించడం మా హక్కు" అని అన్నారు- దీనికి ఓ కారణం ఉంది. అదేమిటంటే, అబ్దె మునాఫ్ తల్లి కూడా ఖుజాఅ తెగకు చెందిన స్త్రీ కావటం - కాబట్టి బనూ ఖుజాఅ దారున్నద్వాకు వెళ్ళి బనూ అబ్దుష్షమ్స్ మరియు నౌఫిల్‌కు వ్యతిరేకంగా బనూ హాషింను సమర్థిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ ప్రతిజ్ఞే మునుముందు, ఇస్లామీయ పరిపాలనలో మక్కా విజయానికి దోహదపడింది. వివరాలు సందర్భాన్నిబట్టి రాబోతున్నాయి.[7]

అబ్దుల్ ముత్తలిబ్ విషయంలో, బైతుల్లాకు (కాబా గృహానికి) సంబంధించి రెండు ప్రధాన సంఘటనలు జరిగాయి. ఒకటి, జమ్‌జమ్ బావి త్రవ్వకం, రెండు, 'ఫీల్' సంఘటన.

**జమ్‌జమ్ బావి త్రవ్వకం:** దీని వివరాలు ఇలా ఉన్నాయి. అబ్దుల్ ముత్తలిబ్‌కు స్వప్నంలో జమ్ జమ్ బావి త్రవ్వమని ఆదేశించడం జరిగింది. స్వప్నంలోనే ఆ ప్రదేశాన్ని కూడా చూపడం జరిగింది. దానికి అనుగుణంగా ఆయన త్రవ్వకం మొదలెట్టారు. బనూ జుర్హుమ్ మక్కాను వదిలేస్తూ అందులో పూడ్చిపెట్టిన వస్తుసామగ్రి క్రమక్రమంగా బయటపడనారంభించాయి. ఆ వస్తువుల్లో ఖడ్గాలు, కవచాలు మరియు రెండు బంగారు లేళ్ళు కూడా ఉన్నాయి. అబ్దుల్ ముత్తలిబ్ ఖడ్గాలను కరిగించి కాబాగృహ సింహద్వారాన్ని పోతపోశారు. రెండు బంగారు లేళ్ళను ఆ ద్వారంలోనే రెండు వైపులా బిగిం చారు. హాజీలకు జమ్‌జమ్ నీరు త్రాగించే బందోబస్తూ చేశారు.

త్రవ్వకంలో జమ్‌జమ్ బావి పూర్తిగా బయటపడినప్పుడు ఖురైష్ తెగవారు అబ్దుల్ ముత్తలిబ్‌తో, వారిని కూడా త్రవ్వకంలో పాలుపంచుకునేటట్లు చేయమని వాదులాడారు. దానికి సమాధానంగా అబ్దుల్ ముత్తలిబ్, లేదు, నేనలా చేయలేను. ఈ పని కోసం నేనొక్కడినే ప్రత్యేకించబడ్డాను అని తెగేసి చెప్పారు. కాని ఖురైషీలు వెనక్కుతగ్గలేదు. చివరికి తీర్పు కోసం వీరంతా బనూ సఅద్‌కు చెందిన ఓ మంత్రగత్తె (కాహిన్ స్త్రీ) వద్దకు వెళ్ళాలని నిర్ణయం జరిగింది. ప్రజలు మక్కా నుండి బయలుదేరారు కూడా. కాని మార్గమధ్యంలో అల్లాహ్ వారికి చూపిన కొన్ని సూచనల ద్వారా జమ్‌జమ్ బావి త్రవ్వకం పని

---

7. ముక్తసిర్ సరీతెరసూల్, షెకుల్ ఇస్లాం ముహమ్మద్ బిన్ అబ్దుల్ వహ్హాబ్ నజవీ- పుట. 41,42.

https://teluguislam.net



దైవం తరపున అబ్దుల్ ముత్తలిబ్‌కే కేటాయించబడిందని తెలిసిపోయింది. వారంతా ప్రయాణాన్ని మానుకొని వెనక్కు మరలివచ్చారు. ఈ సందర్భంలోనే అబ్దుల్ ముత్తలిబ్, దైవంతో, తనకు పది మంది కుమారులను అనుగ్రహించి, వారంతా పెరిగి పెద్దవారై తనను రక్షించే స్థాయికి వస్తే వారిలో ఒక కుమారుణ్ణి కాబా గృహం దగ్గర బలి ఇస్తాను అని మొక్కుకోవడం జరిగింది.[8]

**ఫీల్ సంఘటన :** రెండవ సంఘటన వివరం ఇలా ఉంది. అబ్రహా సబాహ్ అనే అబీసీనియా నీగ్రో (ఇతను అబీసీనియా రాజు 'నజాషీ' తరపున యమన్‌కు గవర్నరుగా నియమించబడినవాడు), అరబ్బులు కాబా గృహం హజ్ చేస్తున్నారని ఓర్వలేక 'సనా' అనే చోట ఓ పెద్ద చర్చిని నిర్మించాడు. అరబ్బులు కాబా గృహం హజ్ చేయకుండా ఈ చర్చికొచ్చి ఆరాధనలు చేయాలని తలచాడు. కాని బనూ కనానాకు చెందిన ఓ వ్యక్తికి ఈ ఎత్తుగడ తెలిసి, ఓ రాత్రి చీకటి సమయాన ఆ చర్చిలోనికి వెళ్ళి ప్రార్థన చేసే స్థలానికి అభిముఖంగా (ఖిబ్లా) ఉన్న గోడకు మలమును పులిమాడు. అబ్రహాకు ఈ విషయం తెలియగానే అగ్గిమీద గుగ్గిలమై అరవై వేల ఓ పెద్ద సైన్యాన్ని వెంటబెట్టుకొని కాబా గృహాన్ని నేలమట్టం చేసే ఉద్దేశ్యంతో బయలుదేరాడు. అతను తన కోసం ఓ మంచి ఏనుగును కూడా ఎంచుకున్నాడు. సైన్యపటాలంలో తొమ్మిది లేక పదమూడు ఏనుగులు ఉన్నాయి. అబ్రహా యమన్ నుండి బయలుదేరి 'ముగమ్మస్' అనే చోటికి చేరుకున్నాడు. తన సైన్యాన్ని యుద్ధం కోసం సన్నద్ధం చేసి, ఏనుగులను క్రమబద్ధం చేసి మక్కాలో ప్రవేశించడానికి బయలుదేరాడు. 'ముజ్‌దలిఫా' మరియు 'మినా'ల నడుమగల 'ముహస్సిర్' కొండ లోయకు చేరుకున్నప్పుడు ఏనుగు కూలబడిపోయింది. కాబా వైపునకు బయలు దేరడానికి ససేమిరా కదలలేదు. ఏనుగు ముఖం ఉత్తరం, దక్షిణం లేదా తూర్పు వైపునకు త్రిప్పినప్పుడు లేచి పరుగులు తీసేది. కాని కాబా వైపునకు త్రిప్పినప్పుడల్లా కూలబడిపోయేది. ఈ సందర్భంలోనే అల్లాహ్, చిన్న చిన్న పక్షుల (పిచ్చుకల) ఓ గుంపును ఆ సైన్యం పైకి పంపించాడు. ఈ పక్షుల గుంపు సైన్యంపై కాల్చిన గట్టి మట్టి లాంటి గులకరాళ్ళను వర్షించింది. ఇలా అల్లాహ్ ఆ సైన్యాన్ని ధాన్యపు పొట్టులా మార్చేశాడు. ఈ పక్షులు అబాబీల్ మరియు పిచ్చుకల్లాంటి పక్షులు. ప్రతి పక్షి వద్ద మూడేసి గులకరాళ్ళు ఉన్నాయి. ఒకటి ముక్కున తక్కిన రెండు, రెండు కాళ్ళ వేళ్ళ సందుల్లో. ఇవి

8. ఇబ్నె హష్షామ్-1/142-147.

https://teluguislam.net



చాలా పదునుగా ఉండి ఎవరికైనా తగిలితే అతని శరీరావయవాలు తెగిపోయేవి. అక్కడనే ప్రాణాలు వదిలేవాడు. ఈ రాళ్ళు అందరికీ తగల్లేదు. అయితే సైన్యంలో జరిగిన త్రొక్కిసలాట కారణంగా ఒకరిని మరొకరు త్రొక్కుకుంటూ పరుగులు తీశారు. త్రొక్కిసలాటలో ప్రతి దారిలోను, ప్రతి నీటి చెలమ దగ్గరా చనిపోనారంభించారు. ఇటు అబ్రహాపై అల్లాహ్ శిక్ష పడిన తీరు ఎలాంటిదంటే చేతివేళ్ళ గోర్లు చిగురుల నుండి వేరై క్రిందపడిపోయాయి. సన్ఆకు చేరే లోపలే అతని వక్షస్థలం బ్రద్దలై గుండె బయటపడి మరణించాడు.

అబ్రహా చేసిన ఈ దాడికి మక్కా పౌరులు ప్రాణభీతితో కొండ లోయల్లోకి పారిపోయారు. కొండ శిఖరాల్లో తలదాచుకున్నారు. సైన్యంపై దైవశిక్ష అవతరించిన తరువాత వారు ప్రశాంతంగా తమ ఇళ్ళకు చేరుకున్నారు.[9]

ఈ సంఘటన, అనేక చరిత్రకారుల ప్రకారం - దైవప్రవక్త (స) గారి జననానికి కేవలం యాభై రోజులు లేదా యాభై అయిదు రోజుల ముందు ముహర్రమ్ నెలలో సంభవించింది. కాబట్టి ఇది క్రీ.శ. 571 ఫిబ్రవరి చివరి రోజులు లేదా మార్చి నెల ప్రారంభ కాలానికి సంబంధించిన సంఘటన. ఇది నిజంగా హెచ్చరికతో కూడుకున్న ఒక సూచన. దానిని అల్లాహ్ తన ప్రవక్త (స) కోసం, తన కాబా గృహం కోసం అవతరింపజేశాడు. ఎందుకంటే, బైతుల్ మక్దిస్ విషయానికి వస్తే ఆ కాలం నాటి ఇస్లామ్‌కు ఖిబ్లాగా ఉండేది. అక్కడి ప్రజలూ ముస్లిములే అయినప్పటికీ దాన్ని అల్లాహ్ శత్రువు లైన బహుదైవారాధకులు (ముష్రిక్కులు) హస్తగతం చేసుకోవడం జరిగింది. బుఖ్తెనసర్ దాడి క్రీ.పూ. 587 మరియు రోమనుల ఆక్రమణ క్రీ.శ. 70 లాంటి సంఘటనలతో ఈ విషయం అర్థమవుతుంది. కాని దీనికి భిన్నంగా కాబా గృహంపై క్రైస్తవులకు ప్రాబల్యం లభించలేదు. వాస్తవానికి అప్పటి కాలంలో ఈ క్రైస్తవులే ముస్లింలు కాని కాబా పౌరులు ముష్రిక్కులు.

అదే కాదు, ఈ సంఘటన జరిగినప్పటి పరిస్థితుల దృష్ట్యా చూస్తే, ఆనాటి సభ్య ప్రపంచంలోని అనేక ప్రాంతాలకు అంటే రోమ్, పర్షియా వగైరాలకు ఈ వార్త వెనువెంటనే ప్రాకిపోయింది. అబీసీనియాకు రోమ్ సామ్రాజ్యంతో సత్సంబంధం ఉండేది. మరోవంక పారసీకులు రోమనుల కార్యకలాపాలను ఓ కంట కనిపెడుతూనే ఉన్నారు. వారు రోమను మిత్ర రాజ్యాల్లో సంభవించే సంఘటనలను తరచి చూస్తూ ఉండేవారు. ఈ కార

9. ఇబ్నె హష్షామ్-1/43, 56.

https://teluguislam.net



ణాల మూలంగా ఈ సంఘటన జరిగిన వెనువెంటనే పర్షియనులు శీఘ్రగతిన యమన్‌ను వశపరచుకున్నారు. ఈ రెండు గొప్ప సామ్రాజ్యాలే అప్పటి నాగరిక ప్రపంచానికి సంబంధించిన ప్రముఖ ప్రాంతాలను పాలించేవి గనుక, ఈ సంఘటన కారణంగా ప్రపంచ దేశాల దృష్టి అంతా కాబా గృహం వైపునకు మరలింది. వాటికి కాబాగృహ ఔన్నత్యం, గౌరవానికి సంబంధించిన ఒక స్పష్టమైన దైవ సూచనలా అగుపించింది. ఈ గృహాన్ని అల్లాహ్ తన పవిత్రతను కొనియాడటం కోసం ఎంచుకున్నాడన్న విషయం ప్రతి హృదయంలో బాగా నాటుకుపోయింది. కాబట్టి, ఇక్కడి ప్రజల్లో ఏ వ్యక్తి అయినా దైవదౌత్యం చాటుతూ లేచినిలబడడం నేరుగా ఈ సంఘటనతో సంబంధం కలిగి ఉంటుందని, ప్రకృతి నియమాలకు భిన్నంగా విశ్వాసులకు కాకుండా బహుదైవారాధకులకే సహాయం చేయడంలో దైవలీల ఔచిత్యం ఎంతైనా ఉందని తెలుసుకోవడం జరిగింది.

అబ్దుల్ ముత్తలిబ్‌కు మొత్తం పది మంది కుమారులు. వారి పేర్లు ఇలా ఉన్నాయి. హారిస్, జుబైర్, అబూ తాలిబ్, అబ్దుల్లాహ్, హమ్‌జా (ర), అబూ లహబ్, గైదాక్, మకూమ్, సఫార్ మరియు అబ్బాస్ (ర). కొందరు పదకొండు మంది కుమారులని, అతడి పేరు ఖసమ్ అని అంటారు. మరికొందరు పదముగ్గురని, వారిలో ఒకడి పేరు అబ్దుల్ కాబా, మరొకని పేరు హజల్ అని కూడా వాదిస్తారు. అయితే పది మందే అని చెప్పేవారు, మకూమ్‌కు మారుపేరే అబ్దుల్ కాబా అని, గైదాక్‌నే హజల్ అంటారని చెబుతారు. ఖసమ్ అనే పేరు అబ్దుల్ ముత్తలిబ్ సంతానంలోనే లేదు - అబ్దుల్ ముత్తలిబ్‌కు ఆరుగురు కుమార్తెలు. వారి పేర్లు ఇవి: ఉమ్ముల్ హకీమ్. ఈమె పేరే 'బైజా' కూడాను. బర్రా, ఆతికా, సఫియా, అర్వా మరియు మైమూనా.[10]

**3. అబ్దుల్లాహ్ - దైవప్రవక్త (స)గారి తండ్రి:** ఈయన తల్లి పేరు ఫాతిమా. ఈమె అమ్రూ బిన్ ఆయిజ్ బిన్ ఇమ్రాన్ బిన్ మగ్జూమ్ బిన్ యఖ్జా బిన్ ముర్రా కుమార్తె. అబ్దుల్ ముత్తలిబ్ సంతానంలో అబ్దుల్లాహ్ అందరికంటే అందమైన, మచ్చలేని, ప్రియమైన కుమారుడు. ఈయన 'జబీహ్'గా కూడా పిలువబడేవాడు. జబీహ్‌గా పేరు పొందడానికి కారణం కూడా ఉంది. అబ్దుల్ ముత్తలిబ్ కుమారుల సంఖ్య పూర్తిగా పదుగురై తండ్రి ఆస్తిపాస్తులను సంరక్షించే వయస్సుకు చేరిన తరువాత అబ్దుల్ ముత్తలిబ్ తాను మొక్కుకున్న మొక్కు

*10. తల్ఖీహుల్ ఫహూం-పుట. 8,9; రహ్మతుల్ లిల్ ఆలమీన్-2/56,66;*

https://teluguislam.net



బడిని గురించి వారికి తెలియజేశాడు. అందరూ తండ్రి మాటను శిరసావహించారు. ఆ తరువాత అబ్దుల్ ముత్తలిబ్ అదృష్టం చూపే అంబులపై వారి పేర్లు వ్రాసి, హుబల్ దేవత పూజారికి అందజేశారు. అతను ఈ అంబులను త్రిప్పి ఓ బాణాన్ని తీయగా అందు అబ్దుల్లాహ్ పేరు వచ్చింది. అబ్దుల్ ముత్తలిబ్, అబ్దుల్లాహ్ చేయి పట్టుకొని కత్తితో సహా కాబాగృహం వద్దకు తీసుకువెళ్ళారు. కాని ఖురైష్ ప్రజలు, ముఖ్యంగా అబ్దుల్లాహ్ తల్లి వైపువారైన బనూ మఖ్జూమ్ తెగవారు, అబ్దుల్లాహ్ సోదరుడు అబూ తాలిబ్ అడ్డుకున్నారు. దానికి అబ్దుల్ ముత్తలిబ్ వారితో నా మ్రొక్కుబడి సంగతేమిటి? అని అడిగారు. ఓ అర్రాఫా (స్త్రీ జ్యోతిష్కురాలు) వద్దకు వెళ్ళి ఆమెను అడుగుదాం అని సలహా ఇచ్చారు. అబ్దుల్ ముత్తలిబ్ ఓ అర్రాఫా వద్దకు వెళ్ళి అడగ్గా ఆమె, అబ్దుల్లాహ్ మరియు పది ఒంటెలకు చీటీ వేయండి. అబ్దుల్లాహ్ పేరే వస్తే మరో పది ఒంటెల్ని పొడిగిస్తూపోండి. ఇలా ఒంటెల్ని హెచ్చిస్తూ అబ్దుల్లాహ్ పేర చీటి వేస్తూపోండి. ఇది అల్లాహ్ ప్రసన్నుడైనంత వరకూ చేస్తూ పోండి అని, ఒంటెల పేరునే చీటి వస్తే వాటిని జిబహ్ చేయండి అని సలహా ఇచ్చింది. అబ్దుల్ ముత్తలిబ్ తిరిగి వచ్చి అబ్దుల్లాహ్ మరియు పది ఒంటెల నడుమ చీటీ వేశారు. కాని చీటి అబ్దుల్లాహ్ పేరునే పడింది. ఆ తరువాత పదేసి ఒంటెల్ని పెంచుతూపోయారు. అయినా అబ్దుల్లాహ్ పేరే రానారంభించింది. ఇక పూర్తి నూరు ఒంటెల చీటి వేయగా చీటీ ఒంటెల పేరునే పడింది. అప్పుడు అబ్దుల్ ముత్తలిబ్, అబ్దుల్లాహ్‌కు బదులుగా ఆ ఒంటెల్ని జిబహ్ చేశారు. వాటిని మనుషులు, పక్షులు, క్రూరమృగాల కోసం వదిలేశారు. ఈ సంఘటనకు పూర్వం అరేబియాలో రక్తపరిహారం (దీత్) పరిమాణం పది ఒంటెలే ఉండేది. దీని తరువాత అది నూరు ఒంటెలుగా నిర్ణయించబడింది. ఇస్లామ్ కూడా ఈ పరిమితినే యథాతథంగా కొనసాగించింది. దైవప్రవక్త (స) ప్రవచనం ఇలా ఉంది: "నేను ఇద్దరు జబీహ్‌ల సంతానాన్ని, ఒకరు హజ్రత్ ఇస్మాయీల్ (అ.స.), రెండవ వారు నా తండ్రి అబ్దుల్లాహ్."[11]

అబ్దుల్ ముత్తలిబ్ తన కుమారుడు అబ్దుల్లాహ్ వివాహానికి హజ్రత్ ఆమినాను ఎన్నుకున్నారు. ఈమె వహబ్ బిన్ అబ్దె మునాఫ్ బిన్ జహ్రా బిన్ కిలాబ్ కుమార్తె. వంశం, హోదాల రీత్యా ఖురైష్‌కు చెందిన అత్యుత్తమ స్త్రీలో

11. *ఇబ్నె హష్షామ్-1/151, 155; రహ్మతుల్ లిల్ ఆలమీన్-2/89,90; ముఖ్తసర్ సరీతుర్రసూల్ (స)- షేక్ అబ్దుల్లా నజదీ-పుట.12, 22, 23.*

https://teluguislam.net



లెక్కించబడే మహిళ. ఈమె తండ్రి వంశం మరియు గౌరవం రెంటిలోనూ బనూ జహ్రా తెగ సర్దారు. ఆమె మక్కాలోనే తన పుట్టింటి నుండి మెట్టినింటికి వచ్చారు. కొన్ని రోజుల అనంతరం అబ్దుల్ ముత్తలిబ్, అబ్దుల్లాహ్‌ను ఖర్జూరాలు తెమ్మని మదీనాకు పంపించారు. ఆయన అక్కడనే మరణించాడు.

కొందరు చరిత్రకారుల ప్రకారం, ఆయన వ్యాపారార్థం సిరియా దేశానికి వెళ్ళారని, ఖురైష్‌కు చెందిన ఓ వ్యాపార బిడారం వెంట తిరిగి వస్తూ వ్యాధిగ్రస్తుడై మదీనాలో ఆగిపోయారనీ, అక్కడనే మరణించారనీ ఉంది. ఖననం 'నాబిగాజాదీ' ఇంట జరిగింది. అప్పుడు ఆయన వయస్సు పాతిక ఏళ్ళు. అత్యధిక మంది చరిత్రకారులు, దైవప్రవక్త (స) ఇంకా జన్మించలేదని చెప్పారు. అయితే కొందరు మాత్రం ఆయన (స), తన తండ్రి మరణానికి రెండు నెలల ముందే జన్మించారని చెబుతారు.[12] ఆయన మరణవార్త మక్కాకు చేరగానే, హజ్రత్ ఆమినా తీవ్ర దుఃఖంలో ఈ మర్సియా చెప్పారు.

"బత్హా ఒడి హాషిం కుమారుడు లేకుండా ఖాళీ అయింది. ఆయన ఓ సమాధిలో నిద్రపోతున్నాడు. మరణం పిలువగానే ఆయన ఆ పిలుపుకు సమాధానమిచ్చాడు. మరణం, ప్రజల్లో హాషిమ్ కుమారుని లాంటి వ్యక్తిని లేకుండా చేసింది. ప్రజలు ఆయన్ను బల్లపై పెట్టుకొని మోస్తూ వెళ్ళిన ఆ సంధ్యాసమయం ఎంత వ్యధాభరితమైనది! మరణం ఆయన అస్తిత్వాన్ని రూపుమాపితేనేమీ? ఆయన గుణగణాల ముద్రలు మాత్రం చెరపివేయలేదు కదా! ఆయన గొప్ప దాత, కారుణ్య హృదయుడూను."

అబ్దుల్లాహ్ మరణించేటప్పుడు వదలివెళ్ళిన ఆస్తి (తరకా) అంతా ఇదే. అయిదు ఒంటెలు, ఒక మేకల మంద. ఓ నీగ్రో స్త్రీ బానిస. ఆమె పేరు బర్కత్. అందరు పిలిచే పేరు ఉమ్మె అయిమన్. ఈ ఉమ్మె అయిమనే దైవప్రవక్త (స)ను చిన్నప్పుడు ఎత్తుకొని ఆడించేది.

12. *ఇబ్నె హష్షామ్-1/156, 158; ఫిక్కతుసీరహ్-ముహమ్మద్ గజాలి-పుట.45; రహ్మతుల్ లిల్ ఆలమీన్-2/9.*